సర్వం శివోహం..



గుడిలోవలో ఆకాశ గంగలో స్నానమాచరిస్తున్న భక్తులు



గుడిలోవలో పూజలు చేస్తున్న భక్తులు



భీమిలిలోని భీమేశ్వర ఆలయం వద్ద భక్తులు



మహా కామేశ్వర స్వామి ఆలయంలో జడ్జి శ్రీకాంత్ మీనన్‌తో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

ఆనందపురం : మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలన్నీ శివ నామస్మరణతో శనివారం మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకొని షోడశోపచారాలతో శివలింగాన్ని పూజించారు. శివ పంచాక్షరి మంత్రాలతో వేద పండితులు రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. మండలంలోని గుడిలోవలో ఉన్న అతి పురాతన నారాయణేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అక్కడి ఆకాశ గంగలో స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ కోరాడ గిరిరాజు ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో నానాజీ కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆవరణలో ఉన్న నవగ్రహ సహిత జ్ఞాన విఘ్నేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా శనీశ్వర పూజ, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని ముకుందపురంలో స్థానిక సర్పంచ్ కలిమి గంగరాజు ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. బోని, కుసులువాడ, గిడిజాల, పొడుగుపాలెం, చింతల అగ్రహారం, మెట్టమీదపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు చేరుకొని పూజలు చేశారు.

కొమ్మాది: మహా శివరాత్రిని పురస్కరించుకుని వాడ వాడలా శివనామస్మరణ మార్మోగింది. వేకువజాము నుంచి పరమేశ్వరుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్, రామాద్రి, మారికవలస, కొమ్మాది ప్రాంతాల్లో గల శివాలయాల్లో క్షీరాభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పద్మనాభం, కురపల్లి, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస, బి.ఆర్.తాళ్లవలస, గెద్దపేట, విలాస్కాన్‌పాలెం, అనంతవరం ధారకొండపై వెలసిన శివాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు ఈ శివాలయాల వద్ద బారులు తీరారు. రెడ్డిపల్లి శివాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

మధురవాడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మధురవాడలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం, సిద్ధేశ్వర స్వామి ఆలయం , మారికవలస ఆర్‌జీకే కాలనీలో విజయ గణపతి ఆలయ సముదాయంలో గల ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా హరహర మహాదేవ, ఓం నమఃశివాయ నామ స్మరణతో మధురవాడ ప్రతిధ్వనించింది.

జడ్జి శ్రీకాంత్ మీనన్ ప్రత్యేక పూజలు

ఈ సందర్భంగా ఐటీ సెజ్ జంక్షన్ మానం ఆంజనేయులు నగర్‌లోని లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి దేవాలయంలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) శ్రీకాంత్ మీనన్, సీనియర్ సూపరింటెండెంట్ సింగూరి కొండబాబు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, అప్పారావు, జేడీ నాయుడు, ప్రతాపరాజు, అర్చకులు శాస్త్రోక్తంగా ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అలాగే 108 జంటలతో మహా రుద్రాభిషేకం చేయించారు.

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో శివాలయాలను శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇక్కడి మెయిన్‌రోడ్డులో చారిత్రక శివాలయాలు చోడేశ్వర భ్రమరాంబిక, భీమేశ్వర కాత్యాయిని దేవాలయాలకు ఉదయం మూడు గంటల నుంచే భక్తుల రాక మొదలైంది. ఆరు గంటల తర్వాత భారీ సంఖ్యలో భక్తులు దర్శనాలకు బారులు తీరారు. 9 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా భారీ వర్షం కురిసినప్పటికీ భక్తులు కదలకుండా దర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యోగా శిక్షణ కేంద్రం వద్ద నిర్వాహకులు సీహెచ్.వెంకటరమణ పర్యవేక్షణలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీఎం పాలెం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఈ ప్రాంతంలోని శివాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కారుషెడ్ కూడలికి సమీపంలోని శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము 4 గంటల నుంచే మహాదేవునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠం శివాలయంలో వేలాది మంది భక్తులు మహాదేవుని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. పీఎం పాలెం ఆఖరు బస్టాపు సమీపంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నిర్మించిన ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన 108 శివలింగాలకు భక్తులు సామూహిక అభిషేకాలు చేశారు.



మల్లికార్జున స్వామి ఆలయంలో సామూహిక అభిషేకాలు చేస్తున్న భక్తులు



భీమిలిలోని యోగా కేంద్రంలో నిర్వహించిన రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు



రెడ్డిపల్లి శివాలయం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో నారాయణేశ్వర స్వామి విగ్రహం



పద్మనాభంలోని నారాయణేశ్వర స్వామి ఆలయం వద్ద...



పూజలు అందుకున్న శివయ్య



మహా రుద్రాభిషేకం చేయిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారి దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడం, అదేవిధంగా మహా శివరాత్రిని పురస్కరించుకుని వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 1 గంట వరకు, మరలా 2 నుంచి 6 గంటల వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

విజయదుర్గ ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న టి.నగరపాలెం వాసులు మధు, చంద్రశేఖర్

తగరపువలస: బైపాస్ రోడ్డులోని శ్రీవిజయదుర్గ ఆలయంలో శనివారం భీమిలి మండలం టి.నగరపాలేనికి చెందిన పొట్నూరు మధు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా తమ తల్లిదండ్రులు తాతారావు, అన్నపూర్ణ జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్టు వారు తెలిపారు.

27న ఎల్లమ్మ తల్లి జాతర



సంగివలసలో పూజారి అప్పారావు ఇంటి వద్ద ఉత్సవరాట వేస్తున్న గ్రామ పెద్దలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలో ఈ నెల 27న ఎల్లమ్మ తల్లి జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం పూజారి ఊళ్ల అప్పారావు ఇంటి వద్ద గ్రామపెద్దలు ఉత్సవరాట వేశారు. అమ్మవారికి 26న దేవర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాట ఉత్సవం నుంచి జాతర వరకు పూజారి అప్పారావు సంబంధిత గ్రామాల్లో అమ్మవారితో పర్యటించి జోగి సేకరించనున్నారు. ఈ రాట కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, గ్రామపెద్దలు ఊళ్ల నరసింగరావు, అక్కరమాని రాజేష్, సారిపల్లి రాంబాబు, నమ్మి అప్పలనాయుడు, పీతల వెంకట అప్పారావు, సారిపల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పీఎం పాలెం: మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఒకరికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది అమరావతి కాలనీకి చెందిన ఉప్పాడ లక్ష్మిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన సయ్యద్ రఫీ అక్టోబర్ 5, 2020న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవికుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఎస్‌ఐ నీహార్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. విచారణ జరిపిన అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారని సీఐ రామకృష్ణ తెలిపారు.

టైలరింగ్ షాపు దగ్ధం



కాలిపోతున్న టైలరింగ్ షాపు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం కాలనీ జంక్షన్‌లో శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో టైలరింగ్ షాపు పూర్తిగా కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రేవిడి పంచాయతీ సారికవాని కళ్లాలకు చెందిన కోన రమణ ఇదే పంచాయతీ రౌతులపాలెం కాలనీ జంక్షన్‌లో రోడ్డు పక్కన బడ్డీ పెట్టుకుని టైలరింగ్ షాపు నిర్వహిస్తూ దుస్తులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు షాపులో దుస్తులు కుట్టుకుని ఇంటికి వెళ్లిపోయారు. 10 గంటల సమయంలో టైలరింగ్ బడ్డీ కాలుపోతున్నట్టు గుర్తించిన రేవిడి హోటల్ యజమాని రౌతులపాలెం కాలనీ వాసుల ద్వారా రమణకు సమాచారం అందించారు. రమణ ఇంటి నుంచి వచ్చేటప్పటికే బడ్డీ కాలిపోయింది. బడ్డీలో ఉన్న మూడు టైలరింగ్ మిషన్లు, కుట్టిన దుస్తులు, కుట్టడానికి ఉన్న దుస్తులు, ఇతర సామగ్రి మొత్తం కాలిపోయాయి. జీవనోపాధినిచ్చే బడ్డీ కాలిపోవడంతో రమణ రోడ్డునపడ్డాడు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు రాంబాబు, గిరిబాబు, లక్ష్మణరావు

పద్మనాభం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించనున్న భీమునిపట్నం నియోజకవర్గ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్‌లో శనివారం రాత్రి వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. టోర్నమెంటులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవశం చేసుకున్న జట్లకు బహుమతులు ఇవ్వనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, బేపల బంగారునాయుడు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, ఈర్ల ఈశ్వరరావు, చందక శ్రీను, సీర సూరప్పడు, కోన రమణ, గాడు అప్పలరాజు, పిన్నింటి సూర్యనారాయణ, మరగడ అప్పారావు, గేదెల చంద్రరావు, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు, గోస్తనీ విద్యాపీఠ్ వ్యవస్థాపకుడు కాళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

- గిరిజన వసతిగృహాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు
- వార్డెన్ బదిలీకి సిఫారసు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్ రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద



సదస్సులో పాల్గొన్న యువతతో నిర్వాహకులు

ఏయూక్యాంపస్ : ప్రపంచ దిశ దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, వెంకటరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు

మధురవాడ: కొమ్మాది జంక్షన్ – కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు సమీపంలో భూమి వివాదంలో రెండు వర్గాల మధ్య శనివారం వివాదం ఏర్పడింది. దీంతో ఇరు వర్గాలు పీఎం పాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.రాధాకృష్ణ అనే వ్యక్తికి కొమ్మాది డబుల్ రోడ్డుకి అతి సమీపంలో ఎకరం మేర భూమి ఉంది. అందులో అర ఎకరం తన తమ్ముడికి వీలునామా రాశాడు. తమ్ముడు చనిపోవడంతో అతని కుమారుడు హరీష్ భూమి మీద ఉన్నాడు. మిగిలిన అర ఎకరం భూమిని రాధాకృష్ణ కుమారుడు మణికుమార్ ఒంగోలుకి చెందిన జ్యోతి కుమార్ అనే వ్యక్తికి విక్రయించాడు. సదరు వ్యక్తి ఇక్కడ కొమ్మాది రోడ్డులో ఉన్న భూమిలోకి శనివారం వేకువజామున తన మనుషులతో వచ్చాడు. వారిని హరీష్ అడ్డుకున్నాడు. దీంతో వివాదం చోటు చేసుకుంది. ఇరువురూ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవలు జరిగితే చర్యలు తప్పవని, సివిల్ వివాదం కాబట్టి కోర్టులో తేల్చుకోవాలని ఇరువర్గాలకు సూచించారు.

పరిశుభ్రమైన బీచ్‌లే లక్ష్యం



యారాడ బీచ్‌లో తొలగించిన చెత్త, వ్యర్థాలతో నేవీ అధికారులు

పెదగంట్యాడ: తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తూర్పు నావికాదళ అధికారులు తెలిపారు. పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యారాడ, ఆర్కే, భీమిలి బీచ్‌లతో పాటు మేఘాద్రిపేట పరివాహక ప్రాంతంలో శనివారం చెత్తాచెదారాన్ని తొలగించారు. అన్ని ప్రాంతాల్లో కలిపి మొత్తం 410 కిలోల చెత్తాచెదారాన్ని ఏరారు. కోస్టల్ క్లీనప్ కింద ప్రతి నెలా ఓ రోజు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నావికాదళానికి చెందిన 550కి పైగా సర్వీస్, డీఎస్సీ సిబ్బంది పాల్గొన్నారు.

108 లింగాలతో ప్రదోషకాల శతరుద్రాభిషేకం



బీచ్‌రోడ్డు : మహా శివరాత్రి సందర్భంగా విశ్వభారత్ మీడియా ఆధ్వర్యంలో 108 లింగాలతో ఆర్.కె.బీచ్‌లో ప్రదోషకాల శతరుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. రుద్ర హవనం, పాశుపత హోమం వంటి విశేష, విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ రాత్రి భక్తుల కోసం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాగరతీరంలో శివ రాత్రి సందర్భంగా రెండు కార్యక్రమాలు జరగడంతో.. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డుపై నిలుపుదల చేసిన వాహనాలను టోయింగ్ వాహనంపై తరలించినట్టు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అక్కరమాని రామునాయుడు

తగరపువలస: మహా శివరాత్రి సందర్భంగా సీనియర్ క్రీడాకారుడు బోర శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చిట్టివలస బంతాట మైదానంలో డే అండ్ నైట్ వాలీబాల్ టోర్నమెంట్‌ను పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి చిట్టివలస క్రీడాకారులు వివిధ ఆటల పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. వీరి ప్రతిభ చిరస్థాయిగా నిలిచిపోవడానికి చిట్టివలసలో అన్ని వసతులతో ఆటస్థలం ప్రభుత్వం నిర్మించాలని కోరారు. బోర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 20 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10 వేలు, రూ.6 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మొదటి మ్యాచ్ భీమిలి, విల్సన్‌పేట జట్ల మధ్య జరిగింది. కార్యక్రమంలో మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యజమాని ఆదిమూలం నాగరాజు, వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, పోలమాంబ ఫుట్‌బాల్ జట్టు కార్యదర్శి అక్కరమాని చినబాబు, పిట్టా త్రినాథరావు, కె.ఎస్.ఎమ్.సుధాకర్ పాల్గొన్నారు.

ఏపీ విద్యా విధానం దేశానికే ఆదర్శం



డైట్ కాలేజీలో ఢిల్లీ విద్యాధికారుల బృందం

భీమునిపట్నం: మన రాష్ట్రంలోని విద్యా విధానం దేశానికే ఎంతో ఆదర్శంగా ఉందని ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి అన్నారు. ఢిల్లీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యాధికారుల బృందం శనివారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్), కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బృందాలు వీటిని సందర్శించడం వల్ల పరస్పరం విద్యా విధానం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తోందని, అందులో భాగంగా వారికి నాణ్యమైన విద్యతోపాటు, అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఢిల్లీ విద్యాధికారులు శ్రీరామ్‌కిశోర్, రును చౌదరి, సునీత మిట్టల్, ఇరత సభ్యులకు బోధన విధానాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్స్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా జరపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు.